కోడి ధర రూ.70 వేలు

కోడితో జితేందర్‌రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

పక్కనున్న చిత్రంలో కన్పిస్తున్న కోడి ధర రూ.70 వేలంటే నమ్మ సక్యంగా లేదు కదూ.. అసలు ఆ కోడి అంత ధర ఎందుకు పలుకుతోంది. దాని ప్రత్యేక ఏమిటో తెలుసుకుందాం. చెన్నూరు మండలానికి చెందిన జితేం దర్‌రెడ్డి వీరబల్లి మండలం టెంకాయశెట్టిపల్లె మస్తాన్‌రెడ్డి అనే వ్యక్తి నుంచి ఈ కోడిని రూ. 70 వేలకు కొనుగోలు చేశారు. మేలు రకం చిలక ముక్కు జాతికి చెందిన కోడి అని ఆయన చెప్పారు. ఇలాంటివి తన వద్ద 20 ఉన్నాయని, ఇటీవలే ఈ జాతికి చెందిన కోడి పుంజును రూ. లక్షా, 20 వేలకు విక్రయిం చానని తెలిపారు. వీటి గుడ్డు ధర ఒకొక్కటీ రూ.1500 నుంచి రూ.2 వేల వరకు పలుకుతుందని చెప్పారు. ఈ జాతి కోళ్లు రెండు నెలలకు ఒకసారి పది గుడ్లు పొదుగుతాయని పేర్కొన్నారు. ఐదు సెంట్ల స్థలంలో ఒక షెడ్డు ఏర్పాటు చేసి పెంచుతున్నానని, నెలకు లక్ష వరకు దాణా కోసం ఖర్చు చేస్తున్నానని తెలిపారు. మొక్కజొన్నలు, సొజ్జలు, జీడి పప్పును వాటికి ఆహారంగా పెడుతానని తెలిపారు.

190 జిఒను రద్దు చేయాలి : సిఐటియు

ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మెడికల్ అలవెన్స్‌ను కార్మికుల జీతాల నుంచి రికవరీ చేసేందుకు విడుదల చేసిన జిఒ 190ను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. మెడికల్ ఇన్సూరెన్స్‌ను జీతం నుంచి రికవరీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ప్రభుత్వాలలో ఎందరో నాయకులను చూశావం కానీ మున్సిపల్ కార్మికుల పట్ల ఇంతటి నిర్దయగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం ఇదేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలిపారు. మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని చెప్పారు. జిఒ 190ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రూ.26 వేలు వేతనం ఒక దఫా గానే ఖాతాలో జమ చేయాలని పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికులకు ఉత్తుత్తి హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చక పోగా కార్మికులకు నష్టం కలిగించే విధంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ప్రభుత్వానికి ఇచ్చిన హామీల పట్ల చిత్తశుద్ధి ఉంటే హెల్త్ అలవెన్స్‌ను జీతం నుంచి రికవరీ చేయాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు సిహెచ్ ఓబయ్య, జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మీదేవి, మండల ప్రచార కార్యదర్శి పి.వెంకట రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ప్రసాద్, సాలమ్మ, డి.లక్ష్మీదేవి, ఎం.వెంకటరమణ, బాలాజీ, ప్రమీల పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు శాశ్వత పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని అర్జీలకు శాశ్వత పరిష్కారం లభించేలా కృషి చేయాలని కలెక్టర్ గిరీష పిఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి తమ సమస్యల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమానికి వస్తుంటారన్నారు. అధికారులు బాధితుల సమస్యలు గుర్తించి వెంటనే వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అర్జీదారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులకు అర్థమయ్యే విధంగా తప్పులు లేకుండా పరిష్కార నివేదిక పంపాలన్నారు. సోమవారం స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను శనివారం లోపల పరిష్కరించాలిన్నారు. ఏ ఒక్క దరఖాస్తు బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా చూడాలన్నారు. జిల్లాలోని అన్ని శాఖల హెచ్ఒడిలు నియోజకవర్గాలలో పర్యటించి ప్రజల నుంచి వచ్చిన చిన్న చిన్న సమస్యలను ఆకడికక్కడే పరిష్కరించాలన్నారు. గత డిఆర్‌సి సమావేశంలో వచ్చిన సమస్యలపై టేకెన్ యాక్షన్ రిపోర్టు 15 రోజుల లోపల సిపిఒకు సబ్మిట్ చేయాలన్నారు. తరువాత జరగబోయే డిఆర్సి సమావేశానికి ఈ సమావేశంలో వచ్చిన సమస్యలన్నీ పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని శాఖల హెచ్ఒడిలు తమ కార్యాలయ నేమ్ బోర్డులో అన్నమయ్య జిల్లా అని రాయించాలన్నారు. జిల్లాలో ఉండే ప్రతి ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలు, కళాశాలలు వివిధ షాపులకు సంబంధించిన నేమ్ బోర్డుల్లో అన్నమయ్య జిల్లా అని రాయించేందుకు సంబంధితాధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో చాలాచోట్ల కడప, చిత్తూరు పాత జిల్లాల పేర్లు కనిపిస్తున్నాయని అధికారులందరూ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకొని వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, డిఆర్ఒ సత్యనారాయణ, జిల్లా వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష, జెసి తమీమ్ అన్సారీయా

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన

స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష, అధికారులు

ప్రజాశక్తి - రాయచోటి

రాయచోటి పట్టణ అభివృద్ధిలో భాగంగా క్రీడా మైదానం (స్టేడియం), కేంద్రీయ విద్యాలయ నిర్మాణాలకు అందుబాటులో ఉన్న అనువైన స్థలాలను త్వరితగతిని గుర్తించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ గిరీష రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి మండలం దిగువ అబ్బవరం గ్రామం నక్కలవాండ్లపల్లి వద్ద క్రీడా మైదానం, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు ఉన్న అవకాశాలపై అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. దిగువ అబ్బవరం గ్రామం నక్కల వాండ్లపల్లి వద్ద 11 ఎకరాలు ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని తహశీల్దార్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా అక్కడి స్థలం మొత్తం కలియతిరిగి, భూమికి సంబంధించిన మ్యాపులను పరిశీలించారు. రోడ్డు కనెక్టివిటీ, ఇతర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని ఎగుడు దిగుడు లేకుండా చదును చేసి శుభ్రం చేయించాలని అధికారులకు సూచించారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ రవిశంకర్‌రెడ్డి, ఎపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, వైస్సార్ నాయకులు తిరుపాల్ నాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సులను ప్రారంభిస్తున్న ఆర్‌టిసి డిపో మేనేజర్ బండ్లకుమార్

తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-పీలేరు

పౌర్ణమిగిరి ప్రదక్షిణ సందర్భంగా ఆర్‌టిసి పలు డిపోల నుంచి తిరువణ్ణామలై (అరుణాచలం)కు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. సోమవారం పీలేరు ఆర్‌టిసి డిపో నుంచి తిరువణ్ణామలైలోని అరుణాచల గిరి ప్రదక్షిణతో పాటు అరుణాచల స్వామి దర్శనానికి మూడు ప్రత్యేక బస్సుల్లో 150 మంది యాత్రికులు బయలుదేరి వెళ్లారు. డిపో మేనేజర్ బండ్ల కుమార్ స్థానిక బస్టాండులో ప్రత్యేక బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దర్శనం, వేలూరులోని గోల్డెన్ టెంపుల్ దర్శనం కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నేరాలను పూర్తిగా అదుపు చేయాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - తంబళ్లపల్లి

మండలంలో నేరాలను పూర్తిగా అదుపు చేసి శాంతి భద్రతలు నెల కొల్పేందుకు కృషి చేయాలని ఎస్‌పి హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. సోమవారం తంబళ్లపల్లె పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించి నేరాలపై మొలకలచెరువు సిఐ షాదిక్ అలీని అడిగి తెలుసుకున్నారు. గ్రామ మహిళ పోలీసులతో చర్చించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి పార్క్ ఏర్పాటుపై ఎస్ఐ శోభ పోలీసులను అభినందించారు. ఈయన వెంట డిఎస్‌పి రవికుమార్, సిఐ సత్యనారాయణ ఉన్నారు.

గ్రామ మహిళా పోలీసులతో మాట్లాడుతున్నఎస్‌పి

సకాలంలో స్పందించాలి : ఎంపిపి

ప్రజాశక్తి-గాలివీడు

ఫీల్డ్ అసిస్టెంట్లు సకాలంలో స్పందించి ఉన్నతాధికారుల సూచనలు సలహాలు పాటిస్తూ రోజూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపిపి జల్లా సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎంపిడిఒ సభాభవనంలో ఎంపిడిఒ శేఖర్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన ఉపాధి సిబ్బంది సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధార్ కార్డు సీడింగ్ పెండింగ్ లేకుండా చూడాలని పేర్కొన్నారు. చెరువుల పనులు చేపట్టి ఆ మట్టి ద్వారా రైతులకు వ్యవసాయ పొలాలకు ఉపయోపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్యాన్ని పూర్తి చేయాలని అని పేర్కొన్నారు ఉపాధి కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఏపీవో, ఇసి, కంప్యూటర్ ఆపరేటర్, వెలిగల్లు, పందికుంటలో ఎఫ్ఎ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని పీడీతో మాట్లాడి వారం రోజులుగా భర్తీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంపత్ కుమార్, టిఎలు, ఎఫ్ఎలు ఉన్నారు.

అంగన్వాడీ కేంద్రం ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి-సుండుపల్లె

మండలంలోని వెంగమరాజుగారిపల్లె అంగన్వాడీ ఏర్పాటుకు మండల విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇటీవల గ్రామంలోని ఎంపిపి పాఠశాల భవనంలో ఏర్పాటు చేసేందుకు ఎంఇఒ వెంకటేష్ నాయక్ స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం నడుస్తున్న పాఠశాలలో అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి భవనంపైభాగంలో నూతనంగా గదులు ఏర్పాటు చేసి 3, 4, 5 తరగతులు నిర్వహించేలా నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఎప్పటి నుంచో ఉన్న అంగన్వాడీ కేంద్రం సమస్యకు పరిష్కారం లభించింది. స్థలాన్ని పరిశీలించిన వారిలో డిఇ నాగిరెడ్డి, ఎఇ నాగరాజా, సచివాలయం అసిస్టెంట్ ఇంజినీర్ నాగరాజునాయక్, ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రయ్య ఉన్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

బాధితునికి చెక్ అందజేస్తున్న అధికారులు

మండలంలోని గంగిరెడ్డిపల్లి పంచాయతీ ఎర్రగుంట్లపల్లికి చెందిన మస్తాన్‌రెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి రూ.లక్ష మంజూరు చేయించారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, ఎంపిడిఒ ఆనంద్ కుమార్ బాధితునికి చెక్ అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు చిన్‌రెడ్డి, సర్పంచ్ తులసి, వైస్ ఎంపిపి కరీం, కోటిరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గిరీష

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

ఓటరు గుర్తింపు కార్డులకు ఆధార్ అనుసంధానం చేసే కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ స్పందన, హౌసింగ్ ఇళ్ల నిర్మాణాల పురోగతి, 6-బి ఫారం కలెక్షన్స్ తదితర అంశాలపై ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు గుర్తింపు కార్డులకు ఆధార్ అనుసంధాన కార్యక్రమాన్ని వేగవంతం చేసి నిర్దేశించిన గడువు లోపల పూర్తి చేయాలన్నారు. ఇందుకు సంబంధించి 6- బి ఫామ్స్ కలెక్షన్స్ పక్కాగా చేపట్టాలన్నారు. నూతన జాబితా ప్రకారం ఓటర్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే క్లైమ్స్ అండ్ అబ్జెక్షన్స్ పిటిషన్ల పెండింగ్ లేకుండా వందశాతం పూర్తి చేయాలన్నారు. శాసనమండలి నియోజకవర్గ పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలలో ఓటు హక్కు నమోదు కార్యక్రమం ముగిసిందన్నారు. ఇందుకోసం వచ్చిన దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించి ముసాయిదా ఓటర్ల జాబితాను తయారు చేయాలని తెలిపారు. ఓటు హక్కు నమోదు కోసం గరుడ యాప్‌లో వచ్చిన దరఖాస్తులను డౌన్లోడ్ చేసి ఇందులో ఎన్ని దరఖాస్తులు వచ్చాయో రెండు రోజుల లోపల రిపోర్టు తమకు పంపాలన్నారు. ఈ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్లను వెరిఫై చేసి రిపోర్ట్ పంపాలన్నారు. జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి అయ్యేటట్లు చూడాలన్నారు. ప్రస్తుతం వర్షాలు తగ్గిపోయాయని ఇకనుంచి ఇళ్ల నిర్మాణాలలో రోజు రోజుకూ పురోగతి కనిపించాలన్నారు. జగనన్న హౌసింగ్ లేఔట్‌లలో అవసరమైన చోట విద్యుత్తు నీటి సరఫరా ఉండేటట్లు చూడాలన్నారు. హౌసింగ్ లేఔట్లలో ఎక్కడైనా విద్యుత్తు నీటి సమస్య ఉన్నట్లయితే వెంటనే తమకు తెలియజేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న స్పందన విజ్ఞప్తులపై సత్వర చర్యలు తీసుకుని అర్జీదారునికి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఏఒక్క దరఖాస్తూ బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జగనన్న తోడు, జగనన్న విద్యా దీవెన, వైఎస్ఆర్ చేయూత కార్యక్రమాలకు సంబంధించి ఇకెవైసి వందశాతం పూర్తి చేయాలన్నారు. నెలలో రెండు సార్లు సచివాలయ పోలీసులు తమ పరిధిలోని అంగన్వాడీ సెంటర్లను ఇన్స్పెక్షన్ చేసి రిపోర్టు పంపాలన్నారు. బరువు తక్కువ ఉన్న పిల్లలు ఎదుగుదల తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి వారికి సరైన పౌష్టికాహారం అందుతుందా లేదా అనే విషయాలపై ఆరా తీయాలన్నారు. జిల్లాలో అవసరమైన చోట నూతన అంగన్వాడి భవన నిర్మాణాలకు స్థలాలు గుర్తించాలని సంబంధిత తహసిల్దార్లకు సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి కూలీల సంఖ్య పెంచాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో వివిధ అంశాలపై మండలాల వారీగా రివ్యూ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, హౌసింగ్ పీడీ శివయ్య, డ్వామా పీడీ మద్దిలేటి, డిఆర్‌డిఎ ఎపిడి సత్యనారాయణ పాల్గొన్నారు.

వసతి గృహంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారి సందప్ప

విద్యార్థుల్లో సామర్థ్యాన్ని పెంచాలి

- జిల్లా బిసి సంక్షేమ అధికారి సందప్ప

ప్రజాశక్తి-పీలేరు

విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని పెంచి వారి అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా వెనుకబడిన కులాల సంక్షేమ శాఖ అధికారి సందప్ప తెలిపారు. సోమవారం ఆయన పట్టణంలోని కోట పల్లి బిసి బాలుర వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి వసతిగృహ సంక్షేమ అధికారి మునస్వామి నాయక్‌తో మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందివ్వాలని అన్నారు. వారికి ఇప్పటి నుంచే విద్యా సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టిని సారించాలని సూచించారు. ఈ సందర్భంగా కలసిన మీడి యాతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో నాడు-నేడు పథకానికి 18 హాస్టళ్ళు ఎంపిక చేశారని చెప్పారు. వీటి పనుల కోసం అవసరమైన నిధుల అంచనాలను సిద్ధం చేసి పంపామని, నిధులు మంజూరయ్యాక పనులను చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారను. తనిఖీల్లో పీలేరు ఎబిసిడబ్ల్యూఒ సురేష్‌బాబు, సంక్షేమ వసతిగృహాల సంక్షేమ అధికారుల సంఘం అధ్యక్షులు మనోహర్‌రెడ్డి, మునస్వామి పాల్గొన్నారు.

బిసి వసతి గృహంలో తనిఖీ

కలకడ: మండల కేంద్రంలోని బిసి వసతి గృహాన్ని బిసి వెల్ఫేర్ జిల్లా అధికారి సందప్ప సోమవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. చబడ్డాయి. పిల్లలకు ఇస్తున్న భోజనాలపై ఆరా తీశారు. వసతి గృహంలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారనే రికార్డులను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాల్లో నాణ్యత ఉందా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో అన్ని రకాల రికార్డులను పరిశీలించి తన సంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గృహం ప్రాంగణంలో చెట్లు నాటిన కార్యక్రమాన్ని చూసి తన సంతోషం వ్యక్తం చేసి వార్డెన్ సుబ్బరామయ్య పనితీరును మెచ్చుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారమే భోజనాలు వడ్డించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వార్డెన్ సుబ్బరామయ్య, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -కలకడ

ప్రతి సంక్షేమ పథకం ప్రజలకు చేరాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గుడిబండ పంచాయతీ ఎల్లంగుడిబండ, గొల్లపల్లి, చొక్కన్నగారిపల్లి తదితర గ్రామాలలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమం కోసం ప్రజలకు అందుబాటులో ఉండి, అనేక పథకాలు ప్రవేశపెట్టి, ప్రజా సంక్షేమం చూస్తున్న ఏకైక ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోవడం ఖాయమని పేర్కొన్నారు. గ్రామాలలో ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరును సంబంధిత వాలంటీర్‌ను అడిగి తెలుసుకుని వివరాలతో కూడిన పథకాలను ప్రజలకు తెలియజేశారు. గ్రామాలలో ఇంతవరకు అందని పింఛన్ల వివరాలను అడిగి తెలుసుకుని అర్హులైన వారికి పింఛన్లు వచ్చేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామాలలో నీటి సమస్యలు, డ్రైనేజీ సమస్యలు, ఆరోగ్య సమస్యలపై దృష్టి సారించి ప్రజలకు చేరువలో ఉండాలని సంబంధించి అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్, కలికిరి మార్కెటింగ్ యార్డ్ కమిటీ చైర్మన్ రవి కుమార్‌రెడ్డి, మండల ఆర్‌బికె చైర్మన్ హరినాథ్‌రెడ్డి, ఎంపిడిఒ సిహెచ్ నారాయణ, తహశీల్దార్ రాము, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బస్ సర్వీసు ప్రారంభం

ప్రజాశక్తి-గాలివీడు

బత్రేపల్లి తలుపుల మీదుగా గాలివీడుకు ప్రయాణం చేసేందుకు సోమవారం పులివెందుల డిపోకు చెందిన బస్సు సర్వీసు ప్రారంభించారు. పులివెందులలో ఉదయం 8 గంటలకు బయలుదేరి గాలివీడు 11.30 గంటలకు చేరుకుంటుందని, అలాగే సాయంత్రం 5.30 గంటలకు గాలివీడు నుంచి బయలుదేరి పులివెందుల వెళ్తుంది. నెల కిందట వేంపల్లె మీదుగా గాలివీడుకు సర్వీసును నడిపేవారు. బత్రేపల్లి తలుపుల మీద బస్సు నడపాలని ప్రయాణికులు కోరడంతో జిల్లా అధికారులు స్పందించి పులివెందుల నుంచి అదే రూట్‌లో బస్సు సర్వీసు ఏర్పాటు చేశారు.

బస్ షెల్టర్ లేక ప్రయాణికుల ఇక్కట్లు

బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ప్రజాశక్తి -పుల్లంపేట

రెడ్డిపల్లె బస్ షెల్టర్‌తో పాటు స్టాపింగ్ లేక రెడ్డిపల్లెకు సమీపంలోని సుమారు 35 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ గ్రామాల ప్రజలు రెడ్డిపల్లి కేంద్రంగా ప్రతి రోజూ వందలాది మంది వివిధ అవసరాల నిమిత్తం తిరుపతి, కడప నగరాలకు ప్రయాణిస్తుంటారు. ఇక్కడ బస్ షెల్టర్‌తో పాటు ఎక్స్‌ప్రెస్ వంటి బస్‌లు స్టాపింగ్ లేకపోవడం చేత దూర ప్రాంతాలకు వెళ్లాలంటే రెడ్డిపల్లి నుంచి పుల్లంపేటకు వెళ్లాల్సిందే. తిరుగు ప్రయాణంలో కడప నుంచి గాని తిరుపతి నుంచి గాని రెడ్డిపల్లెలో స్టాపింగ్ లేకపోవడం వలన పుల్లంపేటలో దిగి అక్కడి నుండి ఆటోలలో రెడ్డిపల్లికు చేరుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. రోగులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. తిరుపతి, కడప వంటి నగరాలకు చికిత్స కోసం వెళ్లే రోగులు అత్యవసరంగా వెళ్లాల్సివచ్చిన పుల్లంపేటకు వెళ్లక తప్పడం లేదు. చికిత్స చేయించుకుని తిరుగు ప్రయాణంలో రెడ్డిపల్లిలో స్టాపింగ్ లేకపోవడం చేత రాత్రి వేళలో పుల్లంపేటలో దిగి ఆ సమయంలో ఆటోలు కూడా లేకపోవడం చేత రెడ్డిపల్లెకు చేరుకోవడానికి నానా అవస్థలు పడాల్సి వస్తుంది. మండల కేంద్రమైన పుల్లంపేటతో సమానంగా రెడ్డిపల్లిలో వ్యాపార సముదాయాలు జనసంచారం అధికంగా ఉన్నప్పటికీ జాతీయ రహదారిలో తమకంటూ బస్ షెల్టర్ గాని, స్టాపింగ్ గాని లేకపోవడం ఏంటని ఇక్కడి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఏ పాలకులు మారినా ఈ గ్రామాల పరిస్థితి వినేవారు లేరు అని ఇక్కడ గ్రామ ప్రజలు నిత్యం వందలాది మంది ప్రయాణికులు జాతీయ రహదారిలోని రెడ్డిపల్లిలో బస్ షెల్టర్ లేకపోవడం స్టాపింగ్ లేకపోవడం దారుణమని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా రెడ్డిపల్లిలో బస్సు షెల్టర్ ఏర్పాటు చేసి ఎక్స్ప్రెస్ వంటి బస్సుల స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. కనీసం రిక్వెస్ట్ స్టాపింగ్ అయినా మంజూరు చేయాలని ఇక్కడ ప్రజలు కోరుతున్నారు.

ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలి

పులివెందులలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా నిధులు నిర్వహిస్తున్నాను. అనంతంపల్లి నుంచి ప్రతిరోజు పులివెందులకు ప్రయాణించాల్సి ఉంటుంది.

రెడ్డిపల్లిలో బస్ షెల్టర్‌తో పాటు ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్ లేకపోవడం వలన పుల్లంపేటకు వెళ్లాల్సి వస్తుంది. తిరిగి ఇంటికి వచ్చేటప్పుడు కూడా రాత్రి వేళలో రెడ్డిపల్లిలో బస్సులు ఆపకపోవడం వలన పుల్లంపేట నుంచి అనంతం పల్లెకు రావడానికి ఆ సమయంలో ఆటోలు కూడా అందుబాటులో లేక చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. సంబంధిత అధికారులు స్పందించి రెడ్డిపల్లిలో బస్ షెల్టర్, ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్ సౌకర్యం కల్పించాలి.

- అచ్యుత్‌రెడ్డి, ఉద్యోగి, అనంతంపల్లి.

బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి

రెడ్డిపల్లిలో బస్ షెల్టర్ లేక ఎండనక వాననక బస్సులు కోసం ఎదురుచూస్తూ నానావాస్తులు పడాల్సి వస్తుంది. వ్యాపార నిమిత్తం ప్రతిరోరూ ఇతర ప్రాంతాలకు ప్రయాణించాల్సి ఉంది. ఎక్స్‌ప్రెస్ బస్సు స్టాపింగ్‌తో పాటు షెల్టర్ లేకపోవడం వలన సరుకు సమయానికి చేర్చలేక పోతున్నాం. రైతులపై దయవుంచి ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్‌కు అవకాశం కల్పించాలి.

- వెంకటసుబ్బయ్య, పూలవ్యాపారి, రెడ్డిపల్లె.

అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పేదలకు మహాదానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్ని దానాలలో కెల్లా అన్నదానం మహాదానమని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు పేర్కొన్నారు. సోమవారం పాత బస్టాండ్ కూడలిలో లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షులు వై.సుబ్రహ్మణ్యం రాజు సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ నాయుడు మాట్లాడుతూ పేదవారికి పట్టెడన్నం పెట్టడంలో సంతృప్తి ఉంటుం దని తెలియజేశారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహి స్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వ హించడంలో లయన్స్ క్లబ్ ముందు వరుసలో ఉంటుందని తెలిపారు. కార్యక్ర మంలో రీజన్ చైర్మన్ అబ్దుల్లా, కార్యదర్శి రవికుమార్, లయన్స్ క్లబ్ నాయ కులు రామకృష్ణనాయుడు, పి.చంద్ర, ఎ.వెంకటసుబ్బయ్య నాయుడు పాల్గొన్నారు.

నందలూరు: గుండ్లూరు శ్రీఅగస్త్యేశ్వర స్వామి దేవస్థానం వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో అన్న ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు కు[రా మణియాదవ్, ఎస్ఐ మల్లెం రామమోహన్, నందలూరు వాకర్స్ క్లబ్ అధ్యక్షులు శ్యామనబోయిన గురుప్రసాద్, కొత్తపల్లి రాజాచారి, కానకుర్తి వెంకటయ్య, పుత్తా వెంకటేష్, బండారు రెడ్డిశేఖర్‌గౌడ్, వెంకటేష్, మహేశ్వర్ గౌడ్, భారతాల శ్రీధర్ యాదవ్, సుబ్రహ్మణ్యంరెడ్డి, మట్టి బాబు, పాటూరు రమేష్, పాటూరు సుబ్బు, చామంచి పెంచలయ్య, సుబ్బయ్య నాయుడు పాల్గొన్నారు.

టిడిపి నాయకులతో మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్

విజయమే లక్ష్యంగా ముందుకు సాగుదాం : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు కలిసి ముందుకు సాగాలని మదనపల్లి మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ అన్నారు. సోమవారం శ్రీ నేలమల్లేశ్వర స్వామిని కుటుంబ సభ్యులతో, స్థానిక టిడిపి నాయకులతో కలసి దర్శించుకున్నారు. అనంతరం టిడిపి యువ నాయ కులు యశస్విరాజ్, చాణిక్య తేజలతో కలసి ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024లో వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కలసి కృషి చేయాలని పేర్కొ న్నారు. టిడిపి పరిపాలన కోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఎక్కడా కూడా వర్గ విభేదాలు లేకుండా టిడిపి పార్టీ విజయం కోసం అందరితోనూ కలసి పనిచే యటానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అధికార పార్టీ వైఫల్యాలతో ప్రజలు పడుతున్న బాధలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మల్లప్ప, లక్ష్మన్న, చంద్రాయుడు, విజయ్, గోపి, భూపతి, రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

దహన సంస్కారాల కోసం నీటి కొళాయిని ప్రారంభిస్తున్న నంద యాదవ్

దహన సంస్కారాలకు నీటి వసతి ఏర్పాటు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ చెయ్యేరు నది తీరాన దహన సంస్కారాల కోసం సర్పంచ్ జంబు సూర్యనారాయణ చొరవతో అరవపల్లి గ్రామానికి చెందిన తుంటి నందాయాదవ్ నీటి వసతి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇప్పటికే ఈ ప్రాంతంలోని గ్రామ పంచాయతీ పంపు హౌస్ సమీపంలో నీటి తొట్టి ఏర్పాటు చేశారు. సోమవారం నందాయాదవ్ సహకారంతో నీటి టాంకర్ మోటార్, స్నానాలు చేసేందుకు కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. ఇకపై 24 గంటలు ఎప్పుడైనా దహన సంస్కారాలకు నీటి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. నందా లాంటి వ్యక్తులను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని దాతను కొని యాడారు. అనంతరం పూజలు నిర్వహించి మంచినీటి వసతిని ప్రారం భించారు. కార్యక్రమంలో టియుసి మండల అధ్యక్షులు తుమ్మది శివకుమార్, వైఎస్ఆర్ సేవాదళ్ నియోజకవర్గ కార్యదర్శి పొమ్ములశివ నరసింహులు, పంచాయతీ వాటర్ మ్యాన్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పెద్దమండ్యం

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం మదనపల్లి లయన్స్ కంటి ఆసుపత్రి, ఐటిఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 52 మందికి వైద్య పరీక్షలు చేయగా 24 మంది ఉచిత కంటి ఆపరేషన్‌కు ఎంపికైనట్లు నిర్వహులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఇమ్మనుయేల్, డాక్టర్ హరిత, సిహెచ్ఒ కృష్ణయ్య, శివయ్య, డాక్టర్ భాస్కర్ నాయుడు, గౌతమ్‌రెడ్డి పాల్గొన్నారు.

క్షయ వ్యాధి గ్రస్తులను ఆదుకోవాలి

నందలూరు: ప్రధానమంత్రి టిబి ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలో ఉంటున్న ఇద్దరు క్షయ వ్యాధిగ్రస్తులకు యువ నాయకులు గుణయాదవ్ అన్నమయ్య యువశక్తి సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం దత్తతతీసుకున్నారు. 6 నెలల పాటు పౌష్టిక ఆహారం ఇవ్వనున్నట్లు టిబి యూనిట్ అధికారిని డాక్టర్ సృజన తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధిగ్రస్తులకు ఎంపిపి విజయభాస్కర్‌రెడ్డి చేతులమీదుగా ఒక నెల పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మండలంలో మిగతా 13 మంది పేద క్షయ రోగులకు పౌష్టిక ఆహారం అందించడానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సోమిశెట్టి ప్రభాకర్, నాగసుబ్బయ్య, నాని, సిహెచ్ఒ వెంకటరమణ, టిబి సూపర్‌వైజర్ జయప్రకాష్, శివరాం, మండల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ రోగికి పౌష్టికాహారం అందజేస్తున్న ఎంపిపి విజయభాస్కర్‌రెడ్డి

పేదలకు భూములు పంపిణీ చేయాలి : వ్య.కా.స

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి -చిట్వేలి

మండల పరిధిలోని మిట్టపల్లి బాలాజీ నగర్ దళితులకు ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ భూమిని పంపిణీ చేయాలని సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పంది కాళ్ళ మణి మాట్లాడుతూ దళితులకు ప్రభుత్వ భూములు, ఇళ్ల స్థలాలు గ్రామస్తులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొంతమంది పెత్తందార్లు భూ కబ్జాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. స్థానికేతర్లకు బోగస్ పట్టా లతో అనుభవిస్తున్నారన్నారు. ప్రభుత్వ భూములు, ఇండ్ల స్థలాలు స్థానిక దళితులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత టిడిపి ప్రభుత్వంలో ఒక్క ఎకరా కూడా పేదలకు భూమి పంచలేదన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడున్నర సంవత్సరమైనా ఒక్క ఎకరా పేదోడికి పంచ లేదన్నారు. నవరత్నాల్లో భూ పంపిణీ చేర్చుకొని అమలు చేయాలన్నారు. అసైన్మెంట్‌తో సంబంధం లేకుండా బోగస్ ఆన్‌లైన్ చేసిన భూములను విచారణ జరిపి స్వాధీనం చేసుకోవాలన్నారు. ఆ భూమి పేదలకు పంచాలన్నారు. కోనేరు రంగారావు కమిటీ సిఫారసుల ప్రకారం దళితులకు ప్రాధాన్యత ఇచ్చి ప్రతి కుటుంబానికి మూడు ఎకరాల భూమి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కన్వీనర్ పెంచలయ్య, రైల్వేకోడూరు మండల కన్వీ నర్ శివయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆనందయ్య, లక్ష్మీన రస య్య, సుజాత, సుమలత, ద్వారకమ్మ, సుభాషిని, సుగుణమ్మ పాల్గొన్నారు.

ఎస్‌టి జాబితాలో చేర్చవద్దని నిరసన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక మదనపల్లి సబ్‌కలెక్టర్ ఆఫీస్ ఎదుట రాష్ట్ర గిరిజన సమైక్య వ్యవస్థాపక అధ్యక్షులు కోనేటి దివాకర్‌రావు ఆధ్వర్యంలో ఇతర కులాలని ఎస్‌టి జాబితాలో చేర్చరాదని మహాధర్నా చేపట్టారు. గిరిజనుల మహా ధర్నాలో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. అరగుండు, అరమీసం, అర్ధ నగ్న ప్రదర్శనలతో రాష్ట్ర గిరిజన సమాఖ్య నాయకుల నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా దివాకర్ రావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దాదాపు 35 లక్షల మంది పైబడి షెడ్యూలు తెగలు ఉన్నారని, 2011 సామాజిక సర్వే ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 5,27,676 ఎస్‌టి కుటుంబాలు ఉండగా ఈ కుటుంబాలన్నీ దుర్భర పేదరికంలో విద్య వైద్యం సంక్షేమ రాజ్యాంగరక్షణలు అందక మానవ అభివృద్ధి సూచికలో అత్యధిక దిగువ స్థానంలో ఉన్నారన్నారు. గిరిజనులందరూ నిరుపేదలు రెక్కాడితే డొక్కాడని వారు వ్యవసాయ కూలీలు దినవేతన కార్మికులు సంవత్సరానికి 100 రోజులు కూడా పని దొరకని నిరుపేదల్లో నిరుపేదలు పక్కా గృహాలు పారిశుద్ధ్యం తాగునీరు పోషకాహారం లేని గిరిజన ఆవాసాలు తాండాలు సంక్షోభంలో మునిగిపోయాయని తెలిపారు. విద్య వైద్యం పోషకాహారం లేక గిరిజన బాలబాలికలు మహిళలు బలహీనంగా మరణిస్తున్న దారుణ మారణ హోమం నెలకొని ఉన్న ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం బోయ వాల్మీకి బోయ, ఒరియా కులాలను గిరిజన జాబితాలో చేర్చాలని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి శ్యాముల్ ఆనంద్ కుమార్ ఏక సభ్య కమిషన్ ఏర్పాటు చేసి మూడు నెలల్లో నివేదిక ప్రభుత్వానికి అందించాలని జీవో నెంబర్ 52ను తీసుకువచ్చారన్నారు. పోలీసులు నిరసనలు అడ్డుకోవడంతో ఆర్డీవో

నిరసన తెలుపుతున్న గిరిజనులు

మురళిని కలిసి వినతిపత్రం సమర్పించారు. గిరిజనలు ఇతర కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చితే రాష్ట్ర వ్యాప్తంగా మహాధర్నాలు చేపట్టడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిటిఎం శివప్రసాద్, యానాది గంగులప్ప, బండి రమణ, చంద్ర ఈశ్వర, దండు రామచంద్ర, వేంపల్లి రమణ, చంద్ర కాలనీ విశ్వ, గాలేటి నరేంద్ర, గంగాధర్ గాలేటి, అశోక్, రవితేజ, భాస్కర్, శంకర్ వినోద్, రాజశేఖర్, ఆటో రామచంద్ర, కోనేటి ఆనందరావు, శ్రీరాములు, పూల గంగులప్ప, రామాంజనేయులు, స్వర్ణలత, లక్ష్మమ్మ, రామక్క, లచ్చుమ్మ, వెంకటలక్ష్మి, శ్యామలమ్మ, గిరిజనలు పాల్గొన్నారు.

రైతుల జీవనోపాధి పెంచేందుకు కృషి : ఎఒ

ప్రజాశక్తి-కలికిరి

రైతులు, గ్రామ సమాఖ్య సంఘం సభ్యులకు జీవనోపాధి మెరుగుపరిచేందుకు కృషి చేయడమే ప్రధాన లక్ష్యమని వ్యవసాయ అధికారి మమతారెడ్డి తెలిపారు. సోమవారం జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల, అభివృద్ధి పథకం అమలులో భాగంగా మండలంలోని గుట్టపాలెం రైతు భరోసా కేంద్రంలో రైతు ఆసక్తి సంఘాలు, గ్రామ సమైక్య సంఘాలను ఏర్పాటు, బలోపేతంపై మల్లస ముద్రం పెద్దఒడ్డు ఆయకట్టు దారులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుట్టపాలెంలో ఉండే మల్లసముద్రం, పెద్దఒడ్డు చెరువుల కింద ఉండే రైతు ఆసక్తి సంఘాలు, గ్రామ సమైక్య సంఘాలు బలోపేతం, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రా జెక్టులో భాగంగా రైతు ఆసక్తి, గ్రామ సమాఖ్య సంఘాల ఏర్పాటు చేసు కోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఎపిఐఎల్ఐప-2 ప్రాజెక్టు ఎపిడి కుమార్ మాట్లాడుతూ జైకా సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల, జీవనోపాధి అభివృద్ధి పథకం అమలులో 31 చిన్న తరహా నీటి పారుదల ప్రాజెక్టు పరిధిలో సంఘాలు ఏర్పాటు, మార్కెట్ అవకాశాలను మెరుగుపరచడం, ఉత్పత్తి ఆదాయాన్ని పెంచడం, ప్రాజెక్టులోని గ్రామ సమాఖ్య సంఘాలను ఏర్పాటు చేయడంపై వివరించారు. చెరువుల కింద పంటల ఉత్పత్తిని పెంపొందించడం, మార్కెటింగ్ సదుపాయలను బలోపేతం చేయడం, ఆధునికమైన సౌకర్యవంతమైన మార్కెట్ సౌకర్యాల కల్పన ద్వారా వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబముల ఆదాయం పెంచడం చేస్తామని పేర్కొన్నారు. జీవనోపాధుల పెంపుదల గురించి సిబ్బందికి శిక్షణ ఆధునిక పద్ధతిలో పంటల యజమాన్య పద్ధతుల గురించి శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తి సంఘ సభ్యుల జీవన ప్రమాణాలు మెరుగు పడతాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ప్రమీల, సర్పంచ్ వెంకట్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్ సుధాకర్‌రెడ్డి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు రూరల్

పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని యూనియన్ గౌరవాధ్యక్షులు దాసరి జయచంద్ర, అధ్యక్షులు కప్పల రాణి, ప్రధాన కార్యదర్శి సత్యాల చెన్నయ్య పేర్కొన్నారు. సోమవారం ఎపి గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే జీతాలు చెల్లించాలని, చట్టప్రకారం ఆదాయంలో సగభాగం జీతాలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. టెండర్ల వేసుకున్న రూ.18 వేలు అమలు చేయాలన్నారు. నేటి ధరల పెరుగుదలతో పది వేలరూపాయలతో ఎలా జీవించాలని ప్రశ్నించారు. పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. గతంలోనే సమ్మె నోటీస్ ఇచ్చామని తెలిపారు. జీతాలు పెంచుతామంటూ కాలయాపన చేస్తున్నారని తెలిపారు. పెండింగ్ జీతాలు ఇచ్చేవరకు, కనీస వేతనం అమలు చేసే వరకు ఆందోళన కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పెంచలమ్మ, లక్ష్మీదేవి, పోళ్ళమ్మ, గజా, తేజ పాల్గొన్నారు.

భూకబ్జాపై తహశీల్దార్‌కు ఫిర్యాదు

నందలూరు: మండల వైసిపి అధ్యక్షులు సిద్దవరం గోపిరెడ్డి కుయుక్తులు మానుకోవాలని వైసిపి సీనియర్ నాయకులు అన్నం నాగేంద్ర, ముదిరాజ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ భువన బోయిన లక్ష్మీనరసయ్య హితవు పలికారు. సోమవారం మండల వెసిపి నాయకులు సిద్దవరం గోపిరెడ్డి భూకబ్జాలపై కలెక్టర్ గిరీష, రాజంపేట ఆర్‌డిఒ కోదండరామిరెడ్డి, తహశీల్దార్ ఉదయ శంకర్ రాజులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని కుందా నెల్లూరు గ్రామానికి చెందిన సిద్దవరం గోపీనాథ్ రెడ్డి టంగుటూరు రెవెన్యూ పొలం 856లో 50 ఎకరాల 92 సెంట్లు, 859లో 5 ఎకరాల 58 సెంట్లు, 851లో ఎకరా 47 సెంట్లు, 1173లో 8 ఎకరాల 91 సెంట్లు, 236 ఖాతాలో ఆరెకరాల 79 సెంట్లు, వీటితోపాటు మరికొన్ని సర్వే నెంబర్లలోని 100 ఎకరాలు ఆక్రమించాడని పేర్కొన్నారు. అతను ఆక్రమించిన ప్రభుత్వ భూమిని నిరుపేదలైనటువంటి చింతకాయలపల్లి, కుందా నెల్లూరు, మదనమోహన్ పురము, కొత్త చాపలవారి పల్లి గ్రామాలలో భూమి లేనటువంటి ప్రజలకు ఇవ్వవలసిందిగా కలెక్టర్, ఆర్డీవో కలిసి వాళ్లకు సవినయంగా వివరించి అర్జీ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు లక్కిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, హర్ష, చింతకాయల ఎల్లయ్య, భువన బోయిన పెంచలయ్య, చుక్క వెంకటేష్, చింతకాయల వెంకటరత్నం, చాపల రామచంద్రయ్య, చాపల వెంకటసుబ్బయ్య, పోలిశెట్టి నరసింహులు, తోకల వెంకటరమణ, కడప గంగయ్య, చింతకాయల సుబ్బన్న, టంగుటూరు గంగయ్య, మాజీ సర్పంచ్ గంగి నాయుడు పాల్గొన్నారు.

న్యాయ సేవలపై అవగాహన

పుల్లంపేట: మండల కేంద్రంలోని కడప చెన్నై హైవే రెడ్డిపల్లి ఆర్ఎస్‌లో నందలూరు జడ్జి లత ఆదేశాల మేరకు రాజంపేట ఎస్ఇబి ఎస్ఐ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకి న్యాయ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి న్యాయ సేవలు అందేలా చూడాలని తెలిపారు. స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలోనూ ఇంటింటికి వెళ్లి ఉచిత న్యాయం అందరికీ అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. ఈనెల 12న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ, ఎస్ఇబి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించడమే లక్ష్యం

శ్రీచైతన్య విద్యా సంస్థల ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి

విలువలతో కూడిన విద్యను అందించడమే శ్రీచైతన్య విద్యా సంస్థల లక్ష్యమని ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమ వారం ఆయన ప్రజాశక్తితో మాట్లా డుతూ సమాజంలో పిల్లలకు క్రమ శిక్షణ, సంస్కారం కొరవడిందన్నారు. కానీ, శ్రీ చైతన్య పాఠశాలలో విద్యా ర్థులకు చదువుతో పాటు సంస్కారం, క్రమశిక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటేనే చదువులో కూడా రాణించ గలుగుతారన్నారు. ఇందుకోసం తమ పాఠశాలలో ప్రత్యేక చొరవ తీసుకు న్నామని పేర్కొన్నారు. విద్యార్థుల శారీరక ధృఢత్వం మరియు మానసిక వికాసం కోసం తమ పాఠశాలలో డిఎంకె అనే పీరియడ్‌ను కేటాయించి తద్వారా విద్యార్థులకు డ్రాయింగ్, మ్యూజిక్, కరాటే వంటి వాటిలో అర్హత కలిగి నిష్ణాతులైన వారిచే శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. ప్రస్తుత పోటీ ప్రపం చంలో నిలదొక్కుకునేందుకు అర్హత కలిగిన అత్యుత్తమ ఉపాధ్యాయులచే విద్యా బోధన చేయడంతో పాటు ప్రత్యేక పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఒక్కో తరగతికి ఒక్కో క్లాస్ టీచర్ తో పాటు, 1 నుంచి 3 వ తరగతి వరకు ఒక ఇన్చార్జిని, మూడు నుంచి 5వ తరగతి వరకు ఒక ఇన్చార్జిని, 6

నుంచి 10వ తరగతి వరకు ఒక ఇన్చార్జిని నియమించి పర్యవేక్షిస్తామని తెలిపారు. పిల్లలకు బట్టి విధానంలో కాకుండా ప్రతి అంశాన్ని పరిశీలనాత్మక దృష్టితో చూసే విధంగా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులచే ప్రాజెక్టులు, ప్రయోగాలు చేయించి వారిలోని ప్రతిభను వెలికితీయడం, ప్రోత్సహించడం, తరచూ పోటీ పరీక్షలు నిర్వహించడం తమ పాఠశాల ప్రత్యే కతన్నారు. అనేకమంది పేద విద్యార్థులను సైతం ఉచితంగాను, రాయి తీతోను తమ పాఠశాలలో విద్యను అందిస్తున్నామన్నారు. 1345 మంది విద్యార్థులు కలిగిన తమ పాఠశాలలో 222 మందికి కేంద్ర స్థాయి పాఠ్యాంశ బోధన చేస్తున్నామని పేర్కొన్నారు. క్రమశిక్షణ, విద్యార్థుల సంరక్షణతో పాటు, విలువలతో కూడిన విద్యను అందించడం వల్లనే శ్రీ చైతన్య పాఠశాల జిల్లాలో ఓ ప్రత్యేకమైన స్థానాన్ని దక్కించుకోగలిగిందని తెలియజేశారు.

బాస్కెట్‌బాల్ టీమ్‌కు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ యువరాజ్

బాస్కెట్‌బాల్ టీమ్‌కు మిట్స్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-కురబలకోట

మదనపల్లె మిట్స్ కళాశాలలో బి.టెక్ చదువుతున్న విద్యార్థులు అనంతపురం జెఎన్‌టియు బాస్కెట్‌బాల్ టీమ్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. జెఎన్‌టియుఎ ఇంటర్ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ టీమ్‌లో భరత్వాజ్, నిహిత కృష్ణ, లక్ష్మి తన్విజ ఆడతారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరెస్పాండెట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ఫిజికల్ డైరెక్టర్ దామోదరన్, అధ్యాపకులు, తదితరులు అభినందనలు తెలియాజేశారు.

శ్రీసౌమ్యనాథ స్వామిని దర్శించుకున్న ఎంపిపి విజయ్‌భాస్కర్‌రెడ్డి

శ్రీసౌమ్యనాథ స్వామిని దర్శించుకున్న ఎంపిపి

ప్రజాశక్తి-నందలూరు

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీసౌమ్యనాథ స్వామిని ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాలతో ఘనంగా సత్కరించి స్వామివారి చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సోమిశెట్టి ప్రభాకర్, ఓట్స్ శ్రీనివాసులు, నాగ సుబ్బయ్య, అరిగే నాని పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రలో విద్యార్థులు

ప్రజాశక్తి - గాలివీడు

స్థానిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలు సోమవారం విజ్ఞాన విహారయాత్ర నిమిత్తం లేపాక్షి పుట్టపర్తి జిల్లాలోని సైన్స్ మ్యూజియం, విజ్ఞానానికి సంబంధించిన సందర్శనలకు వెళ్లారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓ.నిర్మల పేర్కొన్నారు. విద్యార్థినిలు బయట ప్రదేశాలకు వెళ్లి జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పిఇటి మాస్టర్, స్కూల్ కమిటీ చైర్మన్ కుందా లక్ష్మీ ప్రసన్న విద్యార్థినిలు పాల్గొన్నారు.

పాగొండ ఖలీల్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

వైసిపి జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికైన పాగొండ ఖలీల్ అహ్మద్‌ను సోమవారం మండల నాయకులు ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. కార్య క్రమంలో బీరంగి సర్పంచ్ ఎస్.వెంకటరమణ,గుడిపల్లి సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు నాసిర్, ఎంపిటిసి యలపా శంకర్‌రెడ్డి, వెంకటప్ప, శంకర, జీవి రామకృష్ణ, చెన్నకృష్ణ, రియాజ్, సల్మాన్, సద్దాం, ముజ్ మాయిల్, అర్షద్, షబ్బీర్, సమీర్, ఇంతియాజ్ ఎంఎల్ఒ పాగొండ రఫీ పాల్గొన్నారు.

ఖలీల్ అహ్మద్‌ను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

క్రైం కార్నర్

భార్యను హత్య చేసిన భర్త

ప్రజాశక్తి - రామాపురం

హత్యకు గురైన ఫాతిమా

మండలంలోని హసనాపురం చెందిన ఫాతిమా(37)పై అను మానంతో భర్త ఖాదర్ బాషా సోమవారం రాత్రి రోకలి బండతో కొట్టి హత్య చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. షేక్ ఫాతిమా ఖాదర్ బాషా 10 సంవత్సరాలకు వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఖాదర్ బాషా గల్ఫ్‌లో ఉంటూ మూడు సంవత్సరాల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. వచ్చినటువంటి భార్యపై అనుమానం పెంచుకొని హింసించేవాడు. సోమవారం రాత్రి అనుమానం ఎక్కువే భార్య రోకలి బండతో తలపై కొట్టడంతో తీరుగాయమై కింద పడిపోయింది. ఆమెను రాయచోటి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఖాదర్‌బాషా రామాపురం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తునట్లు పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా : ఆరుగురు విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ఆటో బోల్తా పడిన ఘటనలో ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారు. సోమవారం మండలంలోని పరసతోపు పంచాయతీ దాదంవడ్డీపల్లెకు చెందిన విద్యార్థినిలు రోజువారి ఆటోలో మోడల్ స్కూల్‌కి వెళ్తుండగా పాఠశాల సమీపంలో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఈ సంఘటనలో కావ్య, కళ్యాణి, ఇందు, కీర్తన, భవిత, శృతి గాయపడ్డారు. వెంటనే వారిని 108 వాహనంలో సిహెచ్‌సి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్ వెంకటరామయ్య విద్యార్థులకు వైద్య చికిత్సలు అందించారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు